సాక్షి ఒడిశా
గురువారం । 9 । మార్చి । 2023


శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,48,341లు, బంగారం 2.87 గ్రాములు, వెండి 155.74 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.


హోలీ.. ఆనందాల రంగేళీ
- 8లో


ముగిసిన బోడ జాతర
- 8లో

న్యూస్‌రీల్‌

ముగిసిన నామినేషన్లు


నామినేషన్‌ పత్రాలు దాఖలు చేస్తున్న న్యాయవాదులు

రాయగడ: రాయగడ బార్‌ అసోసియేషన్‌ ఎన్నికల ప్రక్రియలో తొలి ఘట్టం పూర్తయ్యింది. ఈనెల 25న జరగనున్న ఎన్నికల్లో భాగంగా అధ్యక్ష పదవికి బిభుదత్‌ ప్రధాన్‌, మోహన్‌ నాయక్‌, ఉమాకంత మిశ్రో, దేవి పట్నాయక్‌ నామినేషన్లను ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న రాజేంద్ర సేనాపతి, ఉప ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తున్న ఎద్దు శ్రీహరి, అరుణ్‌ కుమార్‌, రమేష్‌కుమార్‌ పాఢి లకు సమర్పించారు. అదేవిధంగా ఉపాధ్యక్ష పదవికై పద్మనాభ దాస్‌, సురేంద్రకుమార్‌ శర్మ, కార్యదర్శి పదవికి విశ్వనాథ్‌ గంతాయత్‌, మేఘునాథ్‌ నాయక్‌, సహాయ కార్యదర్శిగా గురుప్రసాద్‌ సాహు, రామకృష్ణ పాలి, కోశాధికారి పదవికి మానస్‌రంజన్‌ రథొ, దమయంతి మహానందియా నామినేషన్‌ పత్రాలు దాఖలు చేశారు. దీంతో నామినేషన్ల ఘట్టం పూర్తయ్యింది. గురువారం నామినేషన్ల పరిశీలన, శుక్రవారం ఉపసంహార ప్రక్రియ జరగనుందని ఎన్నికల అధికారి సేనాపతి తెలిపారు.

పట్టుబడిన వాహనాలకు నిప్పు


దగ్ధమవుతున్న వాహనాలు

కొరాపుట్‌: వివిధ ఘటనల్లో పోలీసులకు పట్టుబడిన వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. కొరాపుట్‌ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం ఎదుట బస్టాండ్‌ పక్కన ఉన్న హాకీ గ్రౌండ్‌లో బుధవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అంతా హోలీ సంబరాల్లో ఉండగా అకస్మాతుగా వాహనాలకు నిప్పంటుకుంది. ఈ ప్రాంతంలో వివిధ అసాంఘిక కార్యక్రమాల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలను ఈ మైదానంలో భద్ర పరిచారు. వీటిలో అత్యధికంగా గంజాయి రవాణాలో పట్టుబడినవే. పెద్ద ఎత్తున్న మంటలు రావడంతో ప్రజలు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. సిబ్బందికి అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో 4 చక్రాల వాహనాలు 8 దగ్ధమయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు


గాయాలతో ప్రదీప్‌

రాయగడ: ఎదురెదురుగా వస్తున్న బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. మంగళవారం రాత్రి పట్టణానికి సమీపంలోని సిరిగుడ గ్రామం తరణీ మందిరం వద్ద చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి క్షతగాత్రులు స్థానిక గాయత్రీనగర్‌కు చెందని ప్రదీప్‌ కుమార్‌ బెహరా(28), కాసీపూర్‌ సమితి టికిరి పంచాయతీ ఇర్పిపుట్‌ గ్రామానికి చెందిన సంజీవ్‌ మాఝి(26)గా గుర్తించారు. ప్రదీప్‌ కొరాపుట్‌ జిల్లా లక్ష్మీపూర్‌ నుంచి రాయగడకు బైకుపై వస్తుండగా రాయగడ నుంచి టికిరి వైపు బైకుతో వెళ్తున్న సంజీవ్‌ సిరిగుడ వద్ద మలుపులో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇరువురినీ రాయగడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బృందావన్‌ ప్యాలెస్‌ మార్గంలో నిప్పు


ప్యాలెస్‌ మెయిన్‌గేటు వద్ద దట్టంగా అలముకున్న పొగ

పర్లాకిమిడి: మహేంద్రతనయ నది ఒడ్డున ఉన్న బృందావన్‌ ప్యాలెస్‌ ప్రధాన మార్గంలో గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. దీంతో వెదురు పొదలు, చెట్లు కాలిపోయాయి. గమనించిన ప్యాలెస్‌లోని కాపలాదారు అగ్నిమాపక దళానికి సమాచారం అందించగా, సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపులోకి తీసుకున్నారు. తరచూ బృందావన్‌ ప్యాలెస్‌ ఆవరణలో బయట వ్యక్తులు విందులు, వినోదాలతో జరుపుకొంటున్నారు. అయితే దీనిపై అటు అధికారులు, ఇటు పోలీసులు స్పందించక పోవడం గమనార్హం.

సృజనాత్మకతతో వివక్షకు అడ్డుకట్ట

- యూఎన్‌డీపీ ఒడిశా విభాగాధిపతి అభా మిశ్రా పిలుపు
- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సం
- స్త్రీ శక్తిని కీర్తించిన వక్తలు
- వివిధ రంగాల్లో రాణించిన అతివలకు సత్కారం


బరంపురం: ప్రసంగిస్తున్న బీఎంసీ మేయర్‌ సంఘమిత్ర దొళాయి


భువనేశ్వర్‌: ఐఐటీలో జరిగిన మహిళా దినోత్సవంలో పాల్గొన్న వక్తలు

భువనేశ్వర్‌: ప్రతి ఒక్కరిలో తమదైన ఆలోచనలు, సృజన్మాతకత ఉంటుందని దీనిని సకాలంలో సద్వినియోగించినప్పుడే స్త్రీ, పురుష అసమాతలను అరికట్టవచ్చని ఐక్యరాజ్య సమితి అభివృద్ధి పథకం(యూఎన్‌డీపీ) ఒడిశా విభాగాధిపతి అభా మిశ్రా పేర్కొన్నారు. ఈ కార్యచరణలో అంతా కలసికట్టుగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. మహిళల హక్కులు, లింగ సమానత్వం గురించి అవగాహన పెంచడమే ఐక్యరాజ్యసమితి డిజిట్‌ఆల్‌(ఇన్నోవేషన్‌ అండ్‌ టెక్నాలజీ ఫర్‌ జెండర్‌ ఈక్వాలిటీ) నినాదంగా ప్రకటించారు. భువనేశ్వర్‌ ఐఐటీలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఐఐటీ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ శ్రీపాద్‌ కర్మాల్కర్‌ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో మహిళా సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్‌ డాక్టర్‌ సస్మితా బారిక్‌, ప్రముఖ న్యాయవాది నమ్రతా చద్దా మహిళా సంక్షేమ కమిటీ కో–ఆర్డినేటర్‌ శ్రద్ధా ఝా, రిజిస్ట్రార్‌ దేబరాజ్‌ రథ్‌ తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఐఐటీ అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహిళా సంక్షేమ కమిటీ, విద్యార్థి సంఘాల సహకారంతో స్వీయ రక్షణపై శిక్షణ, కళలు, వక్తృత్వం, కవితల పోటీలు నిర్వహించారు.


పర్లాకిమిడి: మాట్లాడుతున్న మీనాకుమారి టహాల్‌


కొరాపుట్‌: సత్కారం పొందిన మహిళలతో పూర్ణిమా మహంతి

చట్టాలపై అవగాహన తప్పనిసరి

బరంపురం: ఆధునిక ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో పోటీ పడుతున్నారని, దీనికి అనుగుణంగా వారికి కల్పిస్తున్న హక్కులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన అవసరమని బరంపురం మేయర్‌ సంఘమిత్ర దొళాయి సూచించారు. బీఎంసీ పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు రాష్ట్రప్రభుత్వం ఒడిశా స్టేట్‌ వెల్ఫేర్‌ బోర్డ్‌ స్థాపించి, చైతన్య శిబిరాలు నిర్వహించడం ఆనందకరమన్నారు. అలాగే జిల్లాలోని ప్రతి పోలీస్‌ స్టేషన్‌లో డెస్కులు ఏర్పాటు చేసి, పూర్తిస్థాయిలో మహిళా సిబ్బందితో సేవలందించడంపై ప్రశంసించారు. కార్యక్రమంలో పోలీసులు, మహిళా కార్పొరేటర్లు, బీఎంసీ మహిళా ఉద్యోగులు, ఇన్నర్‌వీల్‌ మహిళా క్లబ్‌ ప్రతినిధులు పాల్గొన్నారు.

హక్కుల రక్షణకు పోరాటం

కొరాపుట్‌: ఆదివాసీ మహిళల రక్షణ కోసం పోరాటం చేస్తామని మా ఘరో మహిళా సంస్థ రాష్ట్ర కన్వీనర్‌ రుతు పూర్ణిమా మహంతి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్కిల్‌ డెవలప్‌మెంట్‌ సమావేశ మందిరంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో నైపుణ్యం ప్రదర్శించిన మహిళలను సత్కరించారు.

చైతన్య ర్యాలీ..

రాయగడ: పట్టణంలోని సంస్కృతి మహిళా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని స్నేహ స్వాధర్‌ గృహంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ కారణాలతో భర్తల నుంచి దూరంగా ఉంటున్న మహిళలు తాత్కాలికంగా ఈ గృహంలో ఆశ్రయం పొందుతారని, వారిని ఆదరించి హక్కులను తెలియజేసేందుకు చర్యలు చేపడుతున్నామని సంస్థ అధ్యక్షురాలు సుజాత పాలో తెలిపారు. అలాగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఈ ఏడాది జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాల్లోని మహిళలు సైతం జరుపుకోవడం విశేషం. ఆయా ప్రాంతాల్లోని వారు తమ హక్కుల కోసం పోరాడుతామని ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని గుణుపూర్‌ సమితి చలోకొంబ గ్రామంలో ఈ దృశ్యం కనిపించింది.



రాయగడ: చాలోకొంబ గ్రామంలో ఆదివాసీ మహిళల ర్యాలీ

ఆకాంక్ష సంఘటన్‌ ఆధ్వర్యంలో

పర్లాకిమిడి: మహిళల్లో ఎంతోమంది వివిధ రంగాల్లో ఉన్నత పదవులు సాధించి, సమాజంలో సాధికారతను దక్కించుకుంటున్నారని మహిళా స్మారక కళాశాల అధ్యక్షురాలు రీనా సాహు తెలిపారు. పట్టణంలోని హితేషిణీ సమాజ్‌ భవనంలో ఆకాంక్ష మహిళా సంఘటన్‌ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరనారి ఝాన్సీ లక్ష్మీభాయి చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి, నినాదాలు చేశారు. అనంతరం బాలేశ్వర్‌కు చెందిన జ్యోతిర్మయి సామల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌ నిర్మలాశెఠి, జిల్లా సాంస్కృతిక అధికారి అర్చనా మంగరాజ్‌, అధ్యాపకురాలు డాక్టర్‌ కల్యాణీమిశ్రా, సంపాదకురాలు మీనాకుమార్‌ టహాల్‌, స్వర్ణప్రభ, సంస్థ అధ్యక్షురాలు ఆశాలతా పాణిగ్రాహి హాజరయ్యారు.


ప్రగతిశీలా సంఘటన్‌ ఆధ్వర్యంలో..

పర్లాకిమిడి: పట్టణంలోని ప్యాలెస్‌ యూటెక్‌ కంప్యూటర్స్‌ కార్యాలయంలో జిల్లా కేంద్ర ఆస్పత్రి డీపీఎం సౌమ్య గౌడో మాట్లాడుతూ నారీ ప్రగతితోనే దేశ ఉన్నతి సాధ్యమని తెలిపారు. కృష్ణచంద్ర గజపతి కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ అజయ్‌కుమార్‌ త్రిపాఠి, సామాజికి కార్యకర్త ఎస్‌.లక్ష్మి, ప్రగతిశీల మహిళా సంఘటన్‌ అధ్యక్షురాలు తనూజా శత్పతి, సలహాదారు బిచిత్రానంద బెబర్తా, ప్రియాంక, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గూఢచారి కపోతం!


పావురాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


కాలికి కెమెరా, చిప్‌తో మత్స్యకారులకు పట్టుబడిన పావురం


రెక్కలపై అర్థంకాని భాషలో గుర్తించిన రాతలు

- కాలికి చిప్‌, కెమెరాతో మత్స్యకారులకు చిక్కిన పావురం
- పారాదీప్‌లో స్వాధీనం చేసుకున్న మెరైన్‌ పోలీసులు

భువనేశ్వర్‌: జగత్‌సింగ్‌పూర్‌ జిల్లా పారాదీప్‌ తీరంలో చేపల బోటులో కెమెరా, చిప్‌ అమర్చిన పావురం బుధవారం పట్టుబడింది. జిల్లా ఎస్పీ పీఆర్‌ రాహుల్‌ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. పక్షి రెక్కలపై అర్థం కాని పరదేశీ భాషలో రాసిన ట్యాగ్‌ను గుర్తించారు. దీంతో మెరైన్‌ ఠాణా పోలీసులకు అప్పగించారు. ఘటనపై విచారణ ప్రారంభించారు. వివరాల్లోకి వెళ్తే... చంద్రభాగ తీరం నుంచి సారథి అనే ట్రాలీపై 10రోజుల క్రితం వేట నిమిత్తం సముద్రంలోకి వెళ్లింది. 8రోజుల క్రితం పడవపై వాలిన పావురం కాలికి చిప్‌ అమర్చిన కెమెరా మత్స్యకారుల దృష్టిలో పడింది. విషయాన్ని పారాదీప్‌ మెరైన్‌ ఠాణా పోలీసులకు చేరవేశారు. దీంతో ఒడ్డుకు చేరుకోగానే కపోతాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. దీనిని గూఢచర్యం కోసం ఉపయోగిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. కాలికి అమర్చిన కెమెరా, చిప్‌, ట్యాగ్‌ను పరీక్షల కోసం భువనేశ్వర్‌ లోని ఫోరెన్సిక్‌ ల్యాబ్‌కు తరలించారు. వీటిని గూఢచర్యం కోసం వినియోగిస్తున్నారా.. లేదా ఇతర కోణాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఫోరెన్సిక్‌ నిపుణుల నుంచి పూర్తి నివేదిక వస్తేనే విషయం స్పష్టం అవుతుందని పోలీసు వర్గాలు తెలిపాయి.

పిలవగానే వచ్చింది..

కొణార్క్‌ తీరానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో లంగరు వేసే సమయంలో సారథి అనే ట్రాలర్‌ డెక్‌పై 8రోజుల క్రితం పావురం వాలింది. పిలిచినప్పుడు దగ్గరకు రావడంతో పట్టుకున్నాం. రెక్కల కింద తెలియని భాషలో ఏదో రాసి ఉన్నట్లు గమనించాం. పావురం కాళ్లకు కెమెరా, చిప్‌ అమర్చి ఉండటంతో తొలుత భయపడ్డాం. అప్పటి నుంచి బియ్యం నూకలు వేస్తూ సంరక్షించాం. తీరానికి సమీపంలోకి రాగానే మెరైన్‌ పోలీసులకు సమాచారం అందించి, అప్పగించాం.

– పీతాంబర్‌ బెహరా, మత్స్యకారుడు

ఏప్రిల్‌ 1 నుంచి మజ్జిగౌరమ్మ చైత్రోత్సవాలు


మజ్జిగౌరి అమ్మవారు

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం మజ్జిగౌరమ్మ వార్షిక చైత్రోత్సవాలు ఏప్రిల్‌ 1నుంచి ప్రారంభం కానున్నాయి. 5రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలకు సంబంధించి ఆలయ కమిటీ సన్నహాలు ప్రారంభించారు. ప్రధానంగా ఆది, మంగళ, బుధవారాల్లో అమ్మవారి దర్శనానికి ఒడిశాతో పాటు ఆంధ్రప్రదేశ్‌, ఛత్తీస్‌ఘడ్‌, మధ్యప్రదేశ్‌ తదితర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. ఉత్సవాలు నిర్వహణ సమయంలో తాకిడి మరింత పెరిగే అవకాశం ఉన్నందున పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ మేనేజింగ్‌ ట్రస్టీ రాయిసింగి బిడ్డిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, బాబు దొళాయి తెలియపారు. ఇందులో భాగంగా మార్చి 31న సాయంత్రం సమీపంలోని జంఝావతి నది నుంచి కళశాలతో శుద్ధ జలాలను తీసుకువచ్చి, అమ్మవారి సన్నిధిలో నిలుపడంతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. మరుసటి రోజు ఏప్రిల్‌ 1న అమ్మవారి పాదాలు తీసుకువచ్చి మందిర ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదిలో నిలుపుతారు. 2నుంచి అమ్మవారి ఘటాలు పట్టణంలో ఊరేగిస్తారు. రోజూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ఉత్సవాల సమయంలో అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరిస్తారు. దీనినే సునాబేసో అంటారు. అమ్మవారి ఆభరణాలను స్థానిక జిల్లా ట్రెజరీ కార్యాలయం నుంచి పూర్తి భద్రత దళాల మధ్య తీసుకువచ్చి, ఈ కార్యక్రమం చేపడతారు. మరో వైపు ఈ ఏడాది ఉత్సవాల నిర్వహణకు సుమారు రూ.7 లక్షల రుపాయలు వెచ్చించేందుకు కమిటీ నిర్ణయించింది.

విద్యార్థులకు అస్వస్థత


రామనగుడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు


విద్యార్థినులను పరామర్శిస్తున్న అధికారులు

- గులుండి ఆశ్రమ పాఠశాలలో ఘటన
- ఆస్పత్రికి బాధితుల తరలింపు.. పరామర్శించిన అధికారులు

రాయగడ: జిల్లాలోని రామనగుడ సమితి గులుండి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 10మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. సంక్షేమశాఖ పరిధిలోని ఈ పాఠశాలలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనలో విద్యార్థినులను సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విషయం తెలుసుకున్న రామనగుడ బీడీఓ ప్రభాతి జొడియా, ఐటీడీఏ పీఓ ప్రభ ప్రధాన్‌, ఎస్‌ఎస్‌డీ అధికారి రఘుమణి గమాంగో తదితరులు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని, బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం తరగతులకు వెళ్లి తిరిగి వచ్చిన విద్యార్థినులు.. ఎప్పటిలాగే హాస్టల్‌లో రాత్రి భోజనం చేసి పడుకున్నారు. కొద్ది సేపటికే ఒక్కొక్కరికి వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ముందుగా సమీపంలోని వైద్య కేంద్రానికి తీసుకువెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అక్కడికి నుంచి రామనగుడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. బాధితుల్లో లక్ష్మీ కొర(9), జున్ను హరక(12), సయిలు తాడింగి(13), జస్మిత సాబోరో(14), బాహిణి కద్రక(14), భవానీ కద్రక (14), ససిరిన సాబొరొ(14), నమిత కొంధొపాణి(15), అనుజిత సాబోరో(15), లలిత మండంగి(14), త్రిష్ణ గమాంగో(14) ఉన్నారు. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించి వివరాలను అధికారులు సేకరించారు.

భక్తిశ్రద్ధలతో కామదహనం


బంకమఠంలో పూజలు చేస్తున్న పండితులు

జయపురం: డోలా పూర్ణిమ సందర్భంగా పట్టణంలో బంకమఠం ఆలయం సమీపంలోని హోళపడ వద్ద మంగళవారం రాత్రి కామదహనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం హోళపడకు నిప్పంటించగా, ఉవ్వెత్తున ఎగిసిపడిన కీలలు భక్తులను తన్మయంలో ముంచెత్తాయి. ఈ సందర్భంగా చిన్నారులు కేరింతలతో, యువతీ, యువకులు, వృద్ధుల ఆట పాటలతో ప్రాంగణం మార్మోగింది. ప్రతి వీధిలో రంగువల్లులతో సుందరంగా అలంకరించారు. బీజేపీ శాశ్వత సభ్యులు గౌతమ్‌ సామంతరాయ్‌, బీజేడీ నాయకులు రబినారాయణ నందో, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్‌ బాహిణీపతి, బీఆర్‌ఎస్‌ నేతలు రవీంద్ర మహాపాత్రొ, గోపాలరావు తమ అభిమానులకు మిఠాయిలు పంచిపెట్టారు.

మరో చోరీ గ్యారేజ్‌పై దాడి


గొళంతరా పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహన సామగ్రి

గ్యారేజ్‌ యజమాని సమీర్‌ సామల్‌

- రూ.75 లక్షల దోపిడీ సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు

బరంపురం: జిల్లాలోని గొళంతరా పోలీసులు మరో చోరీ గ్యారేజ్‌పై దాడులు చేశారు. ఇందులో రూ.75 లక్షల విలువైన దోపిడీ సామగ్రి స్వాధీనం చేసుకొని, యజమానిని అరెస్ట్‌ చేశారు. దీనిపై బరంపురం ఎస్పీ సరవణ్‌ వివేక్‌ బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి సమీపంలోని గొళంతరా పోలీసు స్టేషన్‌ పరిధి హల్దియాపదర్‌ జంక్షన్‌లో సమీర్‌ సామల్‌ అనే వ్యాపారి పాత సామగ్రి దుకాణం నిర్వహిస్తున్నారు. అయితే వాహనాల విడిభాగాలు, దోపిడి సొత్తు, ఇంజిన్లు కొనుగోలు అక్రమంగా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సిబ్బంది దాడులు చేపట్టగా, భారీగా దోపిడీ సామగ్రి పట్టుబడింది. దీని విలువ రూ.75 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. యజమానిని అరెస్ట్‌ చేసి, కోర్టులో హాజరు పరిచామన్నారు. పలువురు దుండగులు వాహనాలను దొంగలించిన అనంతరం విడిభాగాలను ఇక్కడ విక్రయిస్తున్నారు. అనంతరం వీటిని వాహనాల దుకాణాల్లో తక్కువ ధరకు అమ్మకాలు జరిపి, సొమ్ము చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా.. గొళంతరా పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో వారం వ్యవధిలోనే రెండో గ్యారేజ్‌ పట్టుబడటంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

విధుల బహిష్కరించిన సేవా కార్మికులు

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని గగణాపూర్ సేవా పేపరుమిల్లు కంట్రాక్ట్ కార్మికులు మంగళవారం విధులు బహిష్కరించారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా ప్రధాన గేటు వద్ద ఆందోళనకు దిగారు. మిల్లు యాజమాన్యం గత కొద్ది నెలలుగా సెక్యూరిటీ గార్డులు, శ్రామికులకు తక్కువ వేతనం ఇస్తున్నారని, గత డిసెంబర్ నుంచి అవి కూడా చెల్లించలేదని వాపోయారు. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు ప్రమోద్ మహంతి మాట్లాడుతూ 2020 ఫిబ్రవరిలో బిల్ట్ సేవా పేపరుమిల్లును కొనుగోలు చేసేందుకు ముందుకు ఓ కంపెనీ యాజమాన్యం ఇండస్ ఇండ్ బ్యాంక్ నుంచి రూ.150 కోట్లు రుణంగా తీసుకుందని తెలిపారు. ఇందులో పాత యజమానికి రూ.100 కోట్లు చెల్లించిందన్నారు. అయితే మిగతా సొమ్మును కాజేసేందుకే మిల్లును నడపలేక పోతున్నట్లు లెక్కలు చూపిస్తున్నారని ఆరోపించారు. కనీసం పనిచేసిన కార్మికులకు సైతం జీతాలు చెల్లించకపోవడం దారణమన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన యాజమాన్య ప్రతినిధులు.. శుక్రవారం వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో అంతా ఆందోళన విరమించారు.

ముగ్గురికి గాయాలు



క్షతగాత్రులకు సపర్యలు చేస్తున్న కానిస్టేబుల్

శ్రీకాకుళం క్రైమ్: పట్టణంలోని బృందావనం దరి ఆనందమయి ఫంక్షన్ హాల్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడినట్టు ట్రాఫిక్ ఎస్సై ఎస్.ఎస్.దొర తెలిపారు. ఆనందమయి ఫంక్షన్ హాల్ వద్ద నరసన్నపేట మండలం గోపిపెంటకు చెందిన చిన్నాల వెంకటరమణ తన ద్విచక్ర వాహనంపై మలుపు తిరుగుతుండగా.. అరసవిల్లి మిల్లు జంక్షన్ నుంచి కలెక్టరేట్ వైపు వెళ్తున్న కార్తీక్ (19) ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ సమయంలో కార్తీక్ వెంట అతని బావమరిది ఉన్నాడు. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వెంకటరమణ తలకు, నుదురుపై గాయాలవ్వడంతో మాట్లాడలేకపోతున్నాడు. కార్తీక్, అతని బావమరిదికి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

30 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలతో ఉన్న వ్యాన్, డ్రైవర్

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి గోపినాథపురం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బొలేరో వ్యాన్‌లో అక్రమంగా బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు వాహనాన్ని తనిఖీ చేయగా సుమారు 30 బస్తాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో బియ్యాన్ని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ ఎస్సై బి.రామారావు తెలిపారు. బియ్యం సంతబొమ్మాళికి చెందిన కె.చిన్నమ్మడుకు చెందినవిగా గుర్తించామని.. వాటివిలువ సుమారు. రూ.50 వేలు ఉంటుందన్నారు. డ్రైవర్ కోరాడ శశికుమార్‌ను అదుపులో తీసుకుని కేసున మోదు చేశామన్నారు.

రూ.10.35 కోట్ల విలువైన అటవీ ఉత్పత్తుల సేకరణ

పార్వతీపురంటౌన్: గిరిజన ప్రాంతంలో జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తులు కొనుగోలు వేగవంతం చేస్తున్నట్లు జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్ర తెలిపారు. స్థానిక జీసీసీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ద్వారా చింతపండు కొనుగోలు ముమ్మరం చేశామన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం రూ.4.30 కోట్లు కొనుగోలు లక్ష్యాన్ని నిర్దేశించగా.. రూ.10.35 కోట్ల విలువగల ఉత్పత్తులను కొనుగోలు చేశామన్నారు. గ్రేడ్-1 రకం చింతపండు రూ.32.40కు, పిక్క తీసిన చింతపండును రూ.65లకు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. మిగిలిన అన్ని రకాల అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర ద్వారా జీసీసీ పరిధిలోని పలు సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో రైతులు నాణ్యమైన చింతపండు, జీడిపిక్కలు, ఇండుగ పిక్కలు, కరక్కాయ, కొండచీపురు, తేనెలను తీసుకుని వచ్చి గిట్టుబాటు ధరలు పొందాలని కోరారు.

హోలీ.. ఆనందాల రంగేళీ

రాష్ట్రవ్యాప్తంగా హోలీ సంబరాలు బుధవారం సందడిగా సాగాయి. రంగుల పండగను చిన్నారులు, పెద్దలు అనే వ్యత్యాసం లేకుండా అంతా ఆనందంగా జరుపుకొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు జల్లుకొని, మిఠాయిలు పంచుకున్నారు. తమ అభిమాన నేతలు, అధికారుల ఇళ్లకు చేరుకొని, హోలీ వేడుకల్లో మునిగి తేలారు. అలాగే పలు ప్రాంతాల్లోని మార్కెట్లలో రసాయన, కల్తీ రంగుల విక్రయాల దుకాణాలపై పోలీసులు దాడులు చేపట్టారు. లైసెన్స్ లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసిన పలువురు వ్యాపారులకు జరిమాన విధించారు. – సాక్షి నెట్‌వర్క్



రాయగడ: రంగులతో కేరింతలు కొడుతున్న చిన్నారులు



పర్లాకిమిడి: హైటెక్ ప్లాజాలో తిరుపతి పాణిగ్రాహి ఇంటి వద్ద హోలీ సంబరాలు



బరంపురం: గాంధీనగర్‌లో హోలీ సంబరాల్లో యువతీ, యువకులు



మల్కన్‌గిరి: చిదనాంద వీధిలో హోలీ కేరింతల్లో మహిళలు, చిన్నారులు



జయపురం: కార్యకర్తలకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



భువనేశ్వర్: రంగుల దుకాణాల్లో పోలీసుల తనిఖీలు



రాయగడ: వేడకల్లో పాల్గొన్న మంత్రి సరక, ఎమ్మెల్యే ముదులి



బరంపురం: తన ఇంటి వద్ద హోలీ జరుపుకొంటున్న ఎమ్మెల్యే విక్రమ్‌పండా



కొరాపుట్: హోలీ సంబరాల్లో నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్



బరంపురం: గరుడ వాహనపై తిరువీధుల్లో ఊరేగుతున్న సీతారాముల ఉత్సవమూర్తులు



కొరాపుట్: ఎమ్మెల్యే రఘురాం పొడాల్‌తో కలిసి సంబరాలు జరుపుకొంటున్న అభిమానులు



కొరాపుట్: తన నివాసంలో గిరిజన మహిళలతో నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్ మాఝి



పర్లాకిమిడి: కోమటివీధిలో హోలీ సంబరాల్లో మహిళలు



జయపురం: ప్రజలకు మిఠాయిలు పంచి పెడుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

విరజా క్షేత్రంలో పంచాంగ శ్రవణం

భువనేశ్వర్: ఫాల్గుణ పౌర్ణమి పవిత్ర తిథి పురస్కరించుకుని జాజ్‌పూర్ విరజామాత సన్నిధిలో పంచాంగ శ్రవణం నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా జరిపిన ఝులన్ యాత్రలో భక్తులు ఆనందోత్సాహాలతో పాలుపంచుకున్నారు. జ్యోతిష్య సేవకులు అమ్మవారికి కొత్త పంచాంగ విశేషాలు చదివి వినిపించారు. ప్రత్యేక పూజాదులు, సంప్రదాయ ఆచారాలతో అధిష్ఠాతి విరజామాత ఉత్సవ ప్రతిమని ఊంజల మండపానికి తరలించారు. ప్రధాన అర్చకుడు జ్ఞానరంజన్ పతి పర్యవేక్షణలో ఊంజలోత్సవ ప్రత్యేక పూజలు జరిపి, కొత్త పంచాంగాన్ని ఆవిష్కరించారు. ప్రాచీన భాశ్వతి లెక్కల ప్రకారం, 12 రాశుల గ్రహాలు, రాశుల సంచలనం, దేశ భవిష్యత్ అంచనాలతో కొత్త పంచాంగం విశేషాలను చదివి వినిపించారు. ఈ ఏడాది ప్రజలకు పాణొ సంక్రాంతి, ఒడియా నూతన సంవత్సరం పురస్కరించుకుని ఏప్రిల్ 14న సాధారణ ప్రజానీకానికి విడుదల చేస్తారు. బిరజా పంజికగా జాజ్‌పూర్ ప్రాంతంతో భద్రక్, కేంద్రాపడా, కెంజొహర్ జిల్లాల్లో కూడా చలామణిలో ఉంది. ఈ పంచాంగంలో అమ్మవారి నిత్య పూజలు, ప్రత్యేక ఉత్సవాలు సంబంధిత వివరాలు పొందుపరచడం ప్రత్యేకత.



జాజ్‌పూర్ విరజామాత సన్నిధిలో పంచాంగ శ్రవణం

ముగిసిన బోడ జాతర

మల్కన్‌గిరి: జిల్లాలో జరిగిన వన దేవతామూర్తుల ఉత్సవాలు(బోడా జాతర) గత నాలుగు రోజులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి చివరి పూజలు అందుకున్న దేవుళ్లు కన్నంరాజ్(కృష్ణుడు), బాల్‌రాజ్(అర్జునుడు), పోతురాజ్(భీముడు), మా ముత్యాలమ్మ.. అర్ధరాత్రి దాటిన అనంతరం తిరుగు పయనమయ్యారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా సరిహద్దు లోని కలిమెల సమితి పాల్లేరు గ్రామం వద్ద మన్యంకొండకు సాగనంపే కార్యక్రమంలో భాగంగా పూజర్లు సగం దూరంలో వదిలిపెట్టారు. అక్కడి నుంచి భక్తులే అమ్మవారిని సాగనంపారు. ఈ వేడుక బుధవారం ఉదయం వరకు సందడిగా సాగింది. లక్షలాది మంది భక్తులు చేరుకొని, అమ్మావారిని దర్శించుకున్నారు. జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీనాబజార్(ఎగ్జిబిషన్)ను శనివారం వరకు కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



మౌలి మందిరం వద్ద తుది పూజలందుకుంటున్న దేవతలు



తిరుగు ప్రయాణంలో వన దేవతామూర్తులు

గురుకులాల మాజీ సమన్వయకర్తపై చర్య తీసుకోవాలి

- జేసీకి దళిత సంఘాల ప్రతినిధుల వినతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల మాజీ సమన్వయకర్త వై.యశోదలక్ష్మిపై చర్య తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏడు నెలలుగా విచారణ పేరుతో కాలయాపన చేయడం సరికాదన్నారు. తక్షణమే ఆమెపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించి చర్యలు తీసుకోవాలని కోరుతూ జేసీ ఎం.నవీన్‌ను తన చాంబర్‌లో బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే ఇచ్ఛాపురం మండలం మశాకాపురం గ్రామంలో దండాసి కులస్తులు వెళ్లే దారిలో నవగ్రహాల గుడి నిర్మాణం పేరుతో అడ్డంగా గోడ కడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పలాస మునిసిపాలిటీ పరిధిలో దళితుల డీ పట్టా భూములను ఆక్రమిస్తున్నారని..సంబంధిత వ్యక్తులపై చర్య తీసుకోవాలని కోరుతూ ఆ మండల తహసీల్దార్‌కు పలుమార్లు వినతులు అందజేసిన పట్టించుకోవడం లేదని జేసీ దృష్టికి తెచ్చారు. పొందూరు మండలం దళ్లవలస గ్రామంలో దళితుల నివాసాలకు సమీపంలో డంపింగ్ యార్డు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ సమస్యను గతంలో కూడా అధికారుల దృష్టికి తీసుకొచ్చామని.. సమస్యలను పరిష్కరించాలని కోరారు. జేసీని కలిసిన వారిలో దళిత సంఘాల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



జేసీని కలిసిన దళిత సంఘాల నాయకులు

వీఆర్వో మృతికి సంతాపం

బలిజిపేట: తుమరాడ వీఆర్వోగా పనిచేస్తున్న శ్రీనివాసరావు(49) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఇన్‌చార్జ్ తహసీల్దార్ రత్నకుమారి, రెవెన్యూ సిబ్బంది సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సుమారు 250 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి గణేష్ తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో నోటి నుంచి చొంగకారడం, నాలికపై బొబ్బర్లు, అధిక జ్వరం, మేత తీసుకోకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, కాలి గిత్తల మధ్య పుళ్లు వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వ్యాధి నివారణలో భాగంగా పశువులకు ముందస్తుగా టీకాలు వేస్తున్నామన్నారు. పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా చక్రతీర్థ స్నానాలు



జలుమూరు: వంశధార నదిలో స్వామివారి విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలు చేస్తున్న అర్చకులు

జలుమూరు: డోలోత్సవం పురస్కరించుకుని శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానాలు వంశధార నదిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్వతీపరమేశ్వర ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. అనంతరం స్వామివారి విగ్రహాలను ఆలయంలో యథాస్థానంలో ఉంచి పూజలు నిర్వహించారు. ఈఓ పి.ప్రభాకరరావు ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండల కేంద్రంలో అయ్యప్ప జన్మదినం సందర్భంగా బుధవారం స్వామి చక్రతీర్థ స్నానాలు ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి హరిదాసు కోనేరు వరకు ఉత్సవ విగ్రహాన్ని తిరువీధి చేపట్టారు. కోనేరులో చక్రతీర్థ స్నానాలు చేశారు.

ముగిసిన డోలోత్సవం..

కొత్తూరు మండలంలోని గూనభద్రలో నిర్వహించిన డోలోత్సవాలు బుధవారంతో ముగిశాయి. రాధాకాంతాస్వామి ఆలయం వద్ద మూడు రోజుల పాటుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు తిరువీధి చేపట్టారు. గూనభద్ర రిజర్వాయర్‌లో స్వామివారి చక్రతీర్థ స్నానాలు ఆచరించారు.

కొండచీపుర్లకు గిరాకీ



వారపు సంతకు గిరిజనులు తెచ్చిన కొండచీపుర్లు

- సంతల్లో భారీగా అమ్మకాలు
- కొనుగోలుకు పోటీపడుతున్న జీసీసీ అధికారులు, మైదాన ప్రాంత వ్యాపారులు
- జీసీసీ 60 వేల చీపుర్ల కొనుగోలు
- నాణ్యతను బట్టి ఒక్కో చీపురు రూ.40 నుంచి రూ.45

సీతంపేట:

మన్యంలో కొండచీపుర్ల సీజన్ ఆరంభమైంది. గిరిజనులు పెద్ద ఎత్తున సంతలకు తరలించి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇక్కడి కొండచీపుర్లు నాణ్యమైనవి కావడంతో కొనుగోలుకు అటు గిరిజన సహకార సంస్థ (జీసీసీ),ఇటు మైదాన ప్రాంత వ్యాపారులు పోటీపడుతున్నారు. జీసీసీ గిరిజనుల వద్ద నుంచి దాదాపు 60 వేల కొండచీపుర్లను గ్రేడ్‌ను బట్టి రూ. 40, రూ.45కు కొనుగోలు చేసి బయటమార్కెట్‌లో విక్రయిస్తోంది. సీతంపేట (సోమవారం), దోనుబాయి (గురువారం), మర్రిపాడు(బుధవారం), పొల్ల, కుశిమి(శనివారం)లలో జరిగే వారపు సంతల్లో ప్రస్తుతం కొండచీపుర్ల విక్రయాలు జోరందుకున్నాయి.

తయారీకి శ్రమించాల్సిందే...

ఏజెన్సీలో కొండ ప్రాంతంలో కొండచీపురును గిరిజనులు సేకరిస్తారు. వాస్తవంగా ఇది సాహసంతో కూడిన పని. గిరిశిఖరాలు, దట్టమైన అటవీ ప్రాంతాల్లో పెరిగే కొండచీపురు పుల్లలు సేకరించేందుకు గిరిజనులు ఇంటిల్లిపాదీ శ్రమిస్తారు. వారం రోజుల పాటు ఎండబెట్టిన అనంతరం చీపుర్లను కట్టలుగా కట్టి ఒక్కో చీపురును రూ.45 నుంచి రూ.60 వరకు నాణ్యతనుబట్టి విక్రయిస్తామని గిరిజనులు చెబుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఉత్పత్తి ఎక్కువగా ఉందని గిరిజనులు తెలిపారు. సంతల్లో కొనుగోలు చేసిన చీపుర్లు ఎక్కువగా విశాఖపట్నం, విజయనగరం, రాజమండ్రికి తరలిస్తున్నట్టు వ్యాపారులు తెలిపారు.



వ్యాన్‌లో చీపుర్లు ఎక్కిస్తున్న వ్యాపారులు

గిరిజనులకు గిట్టుబాటు ధరలు



గిరిజనులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొండ చీపుర్లను వారపు సంతల్లో కొనుగోలు చేస్తున్నాం. గతేడాది కంటే ఈ సంవత్సరం మద్దతు ధర పెంచాం. నాణ్యతను బట్టి ధర చెల్లిస్తున్నాం.
– దాసరి కృష్ణ, జీసీసీ మేనేజర్

సేకరణ కష్టం



కొండకోనల్లో ఉన్న కొండ చీపురుపుల్లలు వెతకడం కష్టం. ఇవి దొరికిన తర్వాత వీటిని కోసి ఇళ్లకు తీసుకువస్తాం. ఇంటిల్లపాది కష్టపడితే రోజుకు 5 చీపుర్లకు సరిపడా సరుకును సేకరించగలం. వీటిని చీపుర్లుగా అల్లిక కూడా కష్టంతో కూడుకున్నదే.
– ఎస్.బంగారయ్య, పెద్దగూడ

ఉపాధి లభిస్తుంది



కొండచీపుర్ల అమ్మకాలు గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి. కష్టమైనా ఖాళీ సమయాల్లో కొండలపైకి వెళ్లి చీపుర్లను సేకరిస్తారు. వాస్తవంగా మార్కెట్‌లో పలుకుతున్న ధర గిరిజనుల శ్రమకు సరిపోదు. మరికొద్దిగా పెంచాలి.
– ఎస్.సుజాత, అంటికొండ గూడ

క్లుప్తంగా

కిండాం అగ్రహారంలో పులి పాదముద్రలు..!



పులి పాదముద్రలును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

బొండపల్లి: మండలంలోని కిండాం అగ్రహారంలో గల మామిడితోటలో పులి పాదముద్రలను స్థానికులు బుధవారం గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని అటవీ శాఖాధికారులకు తెలియజేయడంతో ట్రాకర్ అమర్‌తో పాటు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కె.రామారావు, కేవీ వెంకటరమణ ఆ ప్రాంత్రాన్ని పరిశీలించారు. అవి పులి పాదముద్రలుగా గుర్తించి, ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలు



గాయపడిన ఆటో డ్రైవర్‌కు సపర్యలు చేస్తున్న స్థానికులు

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై లచ్చయ్యపేట సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆర్.వెంకంపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పెంట శ్రీనివాసరావు తన ఆటోకు గేజరు తగిలించి బొబ్బిలి వెళ్తున్నాడు. అదే సమయంలో సాలూరు నుంచి పార్వతీపురం వెళ్తున్న కారు లచ్చయ్యపేట వద్ద ఎదురుగా వచ్చి ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. శ్రీనివాసరావు తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం బొబ్బిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేశారు.

బైక్ అదుపుతప్పి యువకునికి గాయాలు

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామానికి చెందిన యువకుడు పెంట సతీష్ బైక్‌పై బుధవారం బొండపల్లి వైపు వస్తూ దేవుపల్లి కనిమెరక సమీపంలో అదుపుతప్పి బోల్తాపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో గజపతినగరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి స్థానికులు తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని సర్వజన ప్రభుత్వాస్పత్రికి 108లో తీసుకెళ్లారు.

అంతర్‌వర్సిటీ పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థులు



టి.వర్ష



ఎ.జాహ్నవి

రాజాం సిటీ: హిమాచల్‌ప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీలో ఈ నెల 10 నుంచి 13 వరకు జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల పవర్ లిఫ్టింగ్ పోటీలకు స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థులు ఎ.జాహ్నవి, టి.హర్షలు అర్హత సాధించారని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఇటీవల జీఎంఆర్‌ఐటీలో నిర్వహించిన పోటీల్లో వీరిద్దరు ప్రతిభ చూపారన్నారు. వీరిని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, అధ్యాపకులు అభినందించారు.

అంతర్ జిల్లా చెక్‌పోస్టు ఏర్పాటు



బూరాడ వద్ద ఏర్పాటుచేసిన పోలీస్ చెక్‌పోస్టు

రేగిడి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు బూరాడ కూడలి వద్ద అంతర్ జిల్లా చెక్‌పోస్టును ఏర్పాటుచేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాకు, విజయనగరం జిల్లాలకు మధ్య ఈ కూడలి ఉండడంతో ఇక్కడ బుధవారం నుంచి తనిఖీలు ముమ్మరం చేశామన్నారు.

వైద్య కళాశాల ఏడీగా కోటేశ్వరరావు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా జి.కోటేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏఓగా పనిచేసిన ఆయన పదోన్నతిపై ఇక్కడకు బదిలీ అయ్యారు. అలాగే, ప్రభుత్వ సర్వజనఆస్పత్రి ఏడీగా పి.ఎస్.అప్పారావు నియమితులయ్యారు. ఆయన విశాఖపట్నం ఆంధ్రామెడికల్ కళాశాలలో ఏఓగా పనిచేసి పదోన్నతిపై బదిలీపై ఇక్కడకు వచ్చారు.

కిడ్నీ వ్యాధులతో జాగ్రత్త..!

- నేడు ప్రపంచ కిడ్నీ వ్యాధుల నివారణ దినం
- బీపీ, సుగర్ వ్యాధులను అదుపులో ఉంచుకోవాలి
- జిల్లాలో 5 వేల మంది వరకు కిడ్నీవ్యాధి బాధితులు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి డయాలసిస్ యూనిట్‌లో డయాలసిస్ చేయించుకున్న కిడ్నీ వ్యాధి గ్రస్తురాలు

విజయనగరం ఫోర్ట్: మానవ శరీరంలో మూత్రపిండాలు (కిడ్నీలు) అతి ముఖ్యమైనవి. వీటి పనితీరు మసకబారితే ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. చికిత్స చేసుకోవడంలో అశ్రద్ధవహిస్తే మృత్యువాత పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రతి ఒక్కరూ కిడ్నీ వ్యాధులకు దూరంగా జీవించాలని, చక్కని ఆహారపు అలవాట్లు, ఒత్తిడి లేని జీవితం అలవర్చుకోవాలని హితబోధ చేస్తున్నారు.

జిల్లాలో 5 వేల మందికి పైగా వ్యాధిగ్రస్తులు

జిల్లాలో కిడ్నీ సంబంధిత వ్యాధులతో సుమారు ఐదువేల మంది బాధపడుతున్నట్టు వైద్య రికార్డులు చెబుతున్నాయి. కిడ్నీ వ్యాధులను ప్రారంభదశలో గుర్తించకపోవడం వల్ల డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితికి చేరుతున్నారు. కిడ్నీ వ్యాధులు తలెత్తిన వెంటనే చికిత్స చేయించుకుంటే సురక్షితంగా జీవించవచ్చు. ప్రతి 10 మందిలో ఒకరు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్టు పలు అధ్యయనాల్లో తేలింది. అధిక రక్తపోటు, మధుమేహం, స్థూలకాయం, అంటువ్యాధులు, మాదక ద్రవ్యాల వినియోగమే మూత్రపిండాల వ్యాధికి ప్రధానకారణమని వైద్యులు చెబుతున్నారు.

వ్యాధి సోకితే..

కిడ్నీ వ్యాధి సోకితే గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువ. ఎముకలు బలహీనపడతాయి. మూత్ర విసర్జన కష్టమవుతుంది. అధిక మూత్ర విసర్జన సమస్యలు, దాహం పెరగడం, అలసట, బలహీనత, ఉబ్బిన చేతులు, ముఖం, పాదాలు, నురుగు మూత్రం వంటివి కిడ్నీవ్యాధి లక్షణాలు.

జాగ్రత్తలు ఇలా..

ఆరోగ్యకరమైన జీవన శైలితో వ్యాధిబారిన పడకుండా జాగ్రత్తపడొచ్చు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఎత్తుకు తగిన బరువు ఉండేలా జాగ్రత్తపడుతూ సమతుల్య ఆహారం తీసుకోవాలి. ధూమపానానికి దూరంగా ఉండాలి. కొలెస్ట్రాల్ స్థాయిలను పర్యవేక్షించుకోవడం, వార్షిక శారీరక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నవారు వాటిని అదుపులో ఉంచుకోవాలి. మూత్రపిండ వ్యాధిని గుర్తించేందుకు స్క్రీనింగ్ చేయించుకోవాలి. ఒత్తిడిని అధిగమించేందుకు ధ్యానం, యోగా వంటివి చేయాలి. తగినంత నిద్రపోవాలి. పొగాకు, ఆల్కహాల్ తీసుకోరాదు.

ఆహారపు అలవాట్లే ప్రధానం



ఒత్తిడిలేని జీవన విధానం అలవర్చుకోవడంతో పాటు సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల కిడ్నీ వ్యాధికి దూరంగా జీవించవచ్చు. కిడ్నీ సమస్యలను ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చు. బీపీ, సుగర్ వంటి వ్యాధులను అదుపులో ఉంచుకోవాలి. శారీరక శ్రమకోసం ప్రతిరోజు వ్యాయామం చేయాలి. శరీరంలో కొవ్వు పెరగకుండా చూసుకోవాలి. – డాక్టర్ ఆర్.రవికుమార్, నెఫ్రాలజిస్టు, విజయనగరం

పోటీపడి ముందుకెళ్లడమే సాధికారత

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి

విజయనగరం అర్బన్: మహిళా సాధికారత అంటే అన్ని రంగాలలో పోటీపడి ముందుకు వెళ్లడమేనని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) స్థానిక యూత్ హాస్టల్‌లో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహాభారతం, రామాయణాలలో తెలిపిన మహిళల ఔన్నత్యం, సంస్కృతిని అలవర్చుకోవాలన్నారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పాటలు, అంత్యాక్షరి, క్విజ్, మ్యూజికల్ చైర్, లక్కీ ఉమెన్, డిబెట్ పోటీలలో విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు జి.రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి యుగంధర్, జిల్లా కార్యదర్శి కంటి వెంకటరమణ, కోశాధికారి వై.శంకరరావు, సంయుక్త కార్యదర్శి లెంక సత్తిబాబు, సంఘం మహిళా విభాగం కార్యదర్శి రంభ జ్యోతి, సభ్యులు పద్మజ, కనకరత్నం, ఎస్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ సీహెచ్ లక్ష్మణరావు

విజయనగరం క్రైమ్: గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని టూటౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. టూటౌన్ సీఐ సీహెచ్ లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం... అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం, గుమ్మ పంచాయతీ చెరుకుబిడ్డ గ్రామానికి చెందిన బిసాయి దేముడుబాబు అనేవ్యక్తి గతంలో వైఎస్సార్‌నగర్‌లోని చలుమూరి సాయి, మురళీకృష్ణ అనే వ్యక్తులకు గంజాయి సరఫరా చేసిన కేసులో పరారీలో ఉన్నాడు. వైఎస్సార్ నగర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పక్కా సమాచారంతో టూటౌన్ సీఐ తన సిబ్బందితో కలిసి బిసాయి దేముడుబాబును అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. గంజాయిని ఒడిశా సరిహద్దు గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలుచేసి విజయనగరం పరిసర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు తెలిపాడు. గతేడాది నవంబర్‌లో మోహన్‌సాయి, మురళీకృష్ణల నుంచి రూ.9వేలు తీసుకుని కిలోన్నర గంజాయిని గంట్యాడ వద్దకు వచ్చి అప్పగించినట్టు నేరాన్ని అంగీకరించాడన్నారు. ఈ మేరకు అతడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

కన్నులపండువగా దోలాయాత్ర



పల్లకిలో సీతారాముల ఉత్సవ విగ్రహాల తిరువీధి

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం గ్రామంలో సీతారాముల డోలాయాత్ర బుధవారం కన్నులపండువగా సాగింది. ఉదయం భక్తుల భజనలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిపై తిరువీధి జరిపారు. అనంతరం భక్తులకు ఉత్తరముఖ దర్శనం కల్పించారు. ఆలయ అర్చకుడు బి.ప్రసాదరావుశర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గుళ్లసీతారాంపురం, తాలాడ, ఎస్.రంగారాయపురం, బొద్దూరు, సోమరాజుపేట, వావిలవలస, అంబకండి, తాటిపాడు గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సీతాకుమారికి బెస్ట్ ఉమెన్ ప్రాజెక్టు ప్లానీ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ కె.సీతాకుమారి

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆఫ్ ఇండియా, ఏపీ స్టేట్ ఉమెన్స్ ఫోరం ఈ ఏడాది నిర్వహించిన 'ఎక్స్‌పీరియన్సియల్ లెర్నింగ్ త్రూ కమ్యూనిటీ ఎంగేజ్' పోటీల్లో పట్టణానికి చెందిన మహరాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సీతాకుమారికి బెస్ట్ ఉమెన్ ప్రాజెక్ట్ ప్లానీ అవార్డు లభించింది. విజయవాడలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నట్టు ఆమె బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జోన్-1 పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలకు గాను ప్రథమ స్థానం లభించిందన్నారు. అవార్డు గ్రహీతకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఉదయ్‌శంకర్, అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

వైభవంగా పోలమాంబ అనుపోత్సవం



బాడంగి పోలమాంబ ఘటాలను గుడికి తీసుకెళ్తున్న భక్తులు

బాడంగి: పోలమాంబ అమ్మవారి అనుపోత్సవం బుధవారం వైభవంగా సాగింది. అమ్మవారి ఘటాలను మంగళవారం రాత్రంతా బాడంగి గ్రామంలో తిరువీధి జరిపారు. అమ్మవారి చావిడివద్ద కొద్దిసేపు దింపారు. అనంతరం ఉజ్జిడిబల్లపై అంజలిరథాన్ని అధిరోహించి పూజార్లు రచ్చబండ రోడ్డు నుంచి అమ్మవారి గద్దెవరకు ముడుసార్లు ప్రదక్షణలు చేశారు. ఉదయం చుక్కలసురకొయ్యపై బండి చక్రం ఉంచిన అనంతరం చావిడి వద్ద దించిన ఘటాలను మహిళాభక్తులు గ్రామ పొలిమేరలోని పోలమాంబ గుడికి తీసుకెళ్లారు. అమ్మవారి ఘటాలకు దారిపొడవునా భక్తులు పసుపుకుంకుమలతో పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు.

లైసెన్స్ పునరుద్ధరించలేం

చీపురుపల్లి: గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్‌ఈసీఎస్) లైసెన్స్ పునరుద్ధరణకు అనుమతులు ఇవ్వలేమని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిక్ రెగ్యులేటరీ కమిటీ చైర్మన్ వి.నాగార్జునరెడ్డి స్పష్టం చేశారు. ఆర్‌ఈసీఎస్‌కు లైసెన్స్ పునరుద్ధరించాలని కోరుతూ 2020లో స్థానిక ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం నుంచి ఏపీ పీఈఆర్‌సీను లిఖితపూర్వకంగా కోరారు. రెండేళ్ల తర్వాత ఆర్‌ఈవీఎస్‌కు లైసెన్స్ పునరుద్ధరించలేమంటూ ఏపీఈఆర్‌సీ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. లైసెన్స్ ఎందుకు పునరుద్ధరించలేకపోతున్నామన్న అంశాన్ని సైతం పీఈఆర్సీ చైర్మన్ ఉత్తర్వుల్లో పొందుపరిచారు. గ్రామీణ ప్రాంతాల్లో శతశాతం విద్యుదీకరణ కల్పించడమే లక్ష్యంగా ఆర్‌ఈసీఎస్ ఏర్పడిందని, ఆ లక్ష్యాలను ఎప్పుడో చేరుకోవడం జరిగిందని అందులో స్పష్టం చేశారు.

గంగమ్మతల్లి జాతరలో రాజన్నదొర



కోట సందర్శన అనంతరం జమీందారులతో డిప్యూటీ సీఎం రాజన్నదొర, తదితరులు

మెంటాడ: మండలంలోని ఆండ్ర గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న గంగమ్మతల్లి జాతరలో డిప్యూటీ సీఎం రాజన్నదొర బుధవారం పాల్గొన్నారు. ఆండ్ర జమీందార్ బాబావారి ఆహ్వానం మేరకు కోటలోకి వెళ్లి గంగమ్మతల్లిని దర్శించుకున్నారు. జమీందారులతో ఫొటోలు దిగారు. రాజన్నదొర వెంట సర్పంచ్ వాకపల్లి లక్ష్మి, పార్టీ నాయకులు కుంచు తిరుపతి, శంకరరావు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, లెంక రత్నాకర్‌నాయుడు, గృహసారథుల మండల కన్వీనర్ కనిమెరక త్రినాథరావు, కిలపర్తి మధు, పిట్టాడ సర్పంచ్ నాయుడుబాబు ఉన్నారు.

పోలిపల్లి పైడితల్లి జాతర ఆదాయం రూ.5.86లక్షలు



పోలిపల్లి పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

భోగాపురం: మండలంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా రూ.5.86 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ ప్రసాదరావు తెలిపారు. అమ్మవారి జాతర సందర్భంగా ఆలయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. భక్తుల కానుకల ద్వారా రూ.4,32,900లు, దర్శన టికెట్ల అమ్మకం ద్వారా రూ.1.56 లక్షలు, బంగారం 3 గ్రాములు, వెండి 101 గ్రాములు లభించినట్టు ఈఓ తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, మాజీ ఉపసర్పంచ్ పతివాడ రామకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ కర్రోతు పైడిరాజు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజ్ఞావికాస పరీక్ష విజేతలు వీరే



పాగిరి శ్యామల (ప్రథమ)



బి.జయేంద్రనాయుడు (ద్వితీయ)

విజయనగరం పూల్‌బాగ్: పదో తరగతి విద్యార్థుల్లో పరీక్షలపై భయం పోగొట్టేందుకు ఎస్‌ఎఫ్ఐ, యూటీఎఫ్ సంయుక్తంగా ఇటీవల జిల్లా స్థాయిలో ప్రజ్ఞావికాస పరీక్ష నిర్వహించింది. దీనికి జిల్లా వ్యాప్తంగా 12వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష విజేతల వివరాలను ఎస్‌ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు పూడి రామ్మోహన్, ఈశ్వరరావు బుధవారం వెల్లడించారు. 96 మార్కులతో పాగిరి శ్యామల (సన్‌స్కూల్, రాజాం), 95 మార్కులతో బి.జయేంద్రనాయుడు (సెయింట్ జోసెఫ్ హైస్కూల్, విజయనగరం), 94 మార్కులతో కొమ్మోజు లావణ్య (ప్రగతి ఇంగ్లిష్ మీడియం స్కూల్, గంట్యాడ), ఎస్.దిలీప్ కుమార్ (ఏపీ మోడల్ స్కూల్, సతివాడ) మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిల్చారన్నారు. వీరికి ఈనెల 19వ తేదీన విజయనగరం జిల్లాలో ప్రతిభా పురస్కారం అందజేస్తామని చెప్పారు.

వేగవంతంగా కేసుల దర్యాప్తు

- విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ



బత్తిలి మోడల్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఐజీ హరికృష్ణ, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

భామిని: కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని విశాఖరేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ పోలీస్ అధికారులకు సూచించారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని బత్తిలి పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఏఎస్పీ ఎస్.దిలీప్‌కిరణ్‌కుమార్‌తో కలిసి బత్తిలిలో నిర్మిస్తున్న మోడల్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం స్టేషన్‌లో క్రైమ్ రికార్డులు తనిఖీచేసి కేసుల పరిస్థితిపై సమీక్షించారు. సకాలంలో చార్జిషీట్‌లు దాఖలు చేయాలని బత్తిలి ఎస్సై వై.అమ్మన్‌రావును ఆదేశించారు. దిశ యాప్ వల్ల కలిగే ప్రయోజనాలను గ్రామీణ మహిళలకు వివరించాలని సచివాలయ మహిళా పోలీసులకు సూచించారు. డీఐజీ పర్యటనతో సాయుధ బలగాలు మోహరించాయి. తివ్వా కొండల్లో కూంబింగ్ చేపట్టాయి.

అనుమానాస్పదంగా మహిళ మృతి



మృతి చెందిన హేమలత

బలిజిపేట: మండలంలోని నారాయణపురంలో యలమంచిలి హేమలత(28) అనే గృహిణి మంగళవారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా మృతి చెందినట్టు ఎస్సై ప్రశాంత్‌కుమార్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం హేమలతకు 2018లో నారాయణపురం గ్రామానికి చెందిన యలమంచిలి చిన్న నరసయ్యతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం ఉన్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత హేమలత ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందింది. దీనిపై ఆమె సోదరుడు లోకేష్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గవరమ్మపేటలో గజరాజుల గుంపు



గవరమ్మపేట వద్ద జొన్నచేనులో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట, వెంకటరాజపురం సమీపంలో ఏనుగుల గుంపు బుధవారం సంచరించింది. అరటి, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఏనుగులు తమ పంటలను నాశనం చేస్తున్నా.. అటవీ అధికారులు చోద్యం చూడటం తప్ప వాటిని తరలించేందుకు ప్రయత్నించడం లేదని, తమకు ఏవిధమైన నష్టపరిహారం కూడా ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. గతకొంత కాలంగా బాసంగి, వెంకటరాజపురం, గడబవలస, నిమ్మలపాడు, బిత్రపాడు, బట్లభద్ర తదితర గ్రామాల సమీపంలో ఏనుగులు సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయని స్థానికులు అంటున్నారు.

పది కేసుల్లో నిందితుడి అరెస్టు

- ల్యాప్‌టాప్‌లు, మొబైల్స్, బైక్‌ల రికవరీ
- వివరాలు వెల్లడించిన వన్‌టౌన్ సీఐ వెంకటరావు



సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: చోరీ కేసుతో పాటు పది కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ల్యాప్‌టాప్‌లు, మొబైల్స్, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు కేసు వివరాలను వెల్లడించారు. విశాఖపట్నం పెదవాల్తేరుకు చెందిన నిందితుడు కర్రి శివరామకృష్ణ ఓఎల్‌ఎక్స్‌లో వచ్చిన ప్రకటనలు చూసి వాటిని కొనుగోలు చేసేందుకు వెళ్తాడు. మాయమాటలతో బురిడీ కొట్టిస్తాడు. కొన్నిసార్లు బలవంతంగా వస్తువులను లాక్కుపోతాడు. ఈ తరహాలో హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలో 18 నేరాలకు పాల్పడ్డాడు. గుర్ల మండలం గరికివలసకు చెందిన కోరాట సత్యం అనే వ్యక్తి ల్యాప్‌టాప్‌ను అమ్మేందుకు ఓఎల్‌ఎక్స్‌లో ప్రకటన ఇచ్చాడు. వాటిని కొనుగోలు చేసేందుకు ఈ నెల 4న నిందితుడు బైక్‌పై విజయనగరం ఆర్‌అండ్‌బీ ప్రాంతానికి చేరుకుని, సత్యంను కలవాలని కోరాడు. ఆయన తన ల్యాప్‌టాప్‌తో అక్కడకు వెళ్లి అతనికి చెక్‌చేసుకోమని చెప్పాడు. అది పరిశీలిస్తున్నట్టు నటించి ల్యాప్‌టాప్‌ను పట్టుకెళ్లిపోయేందుకు శివరామకృష్ణ ప్రయత్నించాడు. సత్యం అడ్డుకోవడంతో కత్తితో బెదిరించి, ఛాతిపై గుద్ది ల్యాప్‌టాప్‌తో పరారయ్యాడు. బాధితుడు సత్యం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ బి.వెంకటరావు, ఎస్ఐ వి.అశోక్‌కుమార్, హెచ్‌సీ ఎం.అచ్చిరాజు, కానిస్టేబుళ్లు పి.శివశంకర్, టి.శ్రీనివాసరావు, ఎస్.అజయ్‌కుమార్‌లు దర్యాప్తుచేసి నిందితుడిని వన్‌టౌన్ పరిధిలో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రెండు ల్యాప్‌టాప్‌లు, రెండు మొబైల్ ఫోన్లు, ఆరు మోటారుసైకిళ్లు రికవరీ చేశామని సీఐ తెలిపారు. నిందితుడు ఇదే తరహాలో విశాఖసిటీలో నాలుగు, పార్వతీపురం పట్టణంలో ఒకటి, విజయనగరం వన్‌టౌన్ పరిధిలో ఐదు నేరాలకు పాల్పడినట్టు గుర్తించారు.

సూక్ష్మ పరిశీలకులదే కీలక పాత్ర

- కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకులదే కీలకపాత్ర అని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలుచేయాలని ఆదేశించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియ కోసం నియమించిన సూక్ష్మ పరిశీలకులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఎన్నికల నిబంధనలను కలెక్టర్ వివరించారు. సందేహాలను నివృత్తి చేశారు. సూక్ష్మ పరిశీలకులు ఇతర సిబ్బంది కంటే గంట ముందుగానే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ పూర్తిగా ముగిసేవరకు ఉండాలని, సిబ్బందితోపాటే తిరిగి రావాలని స్పష్టం చేశారు. ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న సంతకవిటి, దత్తిరాజేరు, వేపాడ తదితర పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మలత, రెవెన్యూ అధికారి, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

పోలింగ్ రోజు ప్రత్యేక సెలవు

పోలింగ్ రోజు మార్చి 13న ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఓటర్లయిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక క్యాజువల్ లీవ్‌ను ఎన్నికల సంఘం మంజూరు చేసిందని కలెక్టర్ సూర్యకుమారి తెలిపారు. ప్రైవేటు సంస్థలు కూడా ఓటు వినియోగించుకునేందుకు పట్టభద్రులకు అవకాశం కల్పించాలని కోరారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్ర ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, జిల్లాలో శతశాతం ఓటింగ్ నమోదయ్యేలా చూడాలని కలెక్టర్ ఓటర్లను కోరారు. ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం దాదాపు పూర్తయిందన్నారు. ఓటరు స్లిప్పుతోపాటుగా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 14 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదాన్ని తప్పనిసరిగా తీసుకొని పోలింగ్‌కేంద్రానికి వెళ్లాలన్నారు. నచ్చిన అభ్యర్థి పేరుకు ఎదురుగా ప్రాధాన్యత సంఖ్య ఇవ్వాలని సూచించారు. అంకెలతోనే ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మొత్తం 37 మంది అభ్యర్థులకు ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేయవచ్చన్నారు.